ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 10 | జూన్ 2008



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 16**

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


విజయవాడ ......... 29-02-08

చించినాడ .......... 06-03-08



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 29-02-08, విజయవాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనో దేహములతో సంబంధం లేకుండా ఒక సద్వస్తువు మన హృదయంలో ఉంది. దానికి చావు పుట్టుకలు ఎలా ఉంటాయో తెలియదు. సూర్యుడు ఏవిధంగా అయితే చీకటిని చూడలేడో అలాగే మన హృదయంలో ఉన్న సద్వస్తువుకు అశాంతి ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో తెలియదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. పాండిత్యం జ్ఞానం కాదు, ధనం జ్ఞానం కాదు, మీకు ఉన్న గౌరవాలు జ్ఞానంకాదు, ఇవి అన్నీ బయట గొడవలు. ఇవి ఏమీ జ్ఞానం కాదు. ఈ బయట గొడవల వలన మీకు ఉన్న దేహబుద్ధి నశించదు. ఎంతకాలం అయితే మీకు దేహబుద్ధి నశించదో అంతకాలం మీకు ఆత్మబుద్ధి కలుగదు. ఆత్మబుద్ధి కలిగేవరకూ మనం ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. మనిషి కూడా నీడ వచ్చినట్లుగా దేహబుద్ధి ఉన్నంత కాలం మీరు ఏ దేహం ధరించినా మిమ్మల్ని దుఃఖం, అశాంతి విడిచి పెట్టవు.

అజ్ఞానం పోగొట్టుకోండి అని సబ్జక్టు చెపుతూ ఉంటే ఎవరూ పట్టించుకోరు, ఎవరూ గౌరవించరు. ఎందుచేతనంటే దాని విలువ వారికి తెలియటంలేదు, సబ్జక్టు వదిలేసి ఈ యాగం చేయండి, ఈ యజ్ఞం చేయండి మీ కోరికలు నెరవేరతాయి అంటే అందరూ మీ కూడా పడతారు. మనకు ఏది మంచిదో మనకు తెలియటం లేదు. నేను ఉన్నాను, నేను ఉన్నాను అంటే దుఃఖం లేని స్థితికి వెళ్ళలేము. ఏదైతే ఉందో అదే నేను అని నీకు తెలియాలి. ఆ అద్వైతానుభవం నీకు కలిగేవరకూ ఏ మనిషినీ వాడు ఎంత ధనవంతుడైనా, ఎంత

పండితుడైనా దుఃఖం విడిచిపెట్టదు. ఇప్పడు మనం కొన్ని సుఖాలు అనుభవిస్తున్నాము కదా. అవి సుఖాలు కాదు. అవన్నీ దుఃఖమిశ్రితాలే. బయటనుండి ఏ సుఖాలు వచ్చినా భవిష్యత్‌లో అవి రెట్టింపుకు రెట్టింపు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. నిప్ప మీద చెయ్యి వేస్తే అది మీకు తెలిసినా, తెలియక పోయినా చెయ్యిని కాలుస్తుంది. అది నిప్ప యొక్క స్వభావం. మీకు తెలిసి ఎరుకతోటి హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళినా, మీకు తెలియకుండా అక్కడకు వెళ్ళినా హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళేసరికి దాని తాలుక సుఖం, శాంతితోటి మీ సహస్రారం నిండిపోతుంది. ఆ స్థితిలో ఉండి మీకు ఎవరైనా మాట చెపితే దాని ద్వారా మీకు ఆనందం అందుతుంది కాని కేవలము పాండిత్యం వలన అందేది కాదు. పాండిత్యం యొక్క ప్రయోజనం ఉంది, ధనం యొక్క ప్రయోజనం ఉంది. ఇవన్నీ కంప్లీట్‌గా అవుట్‌సైడ్ గొడవలు. అవన్నీ మనస్సుతో ఎక్వయిర్ చేసుకొనేవి. ఇది అలా కాదు. మనస్సు దాని యొక్క మూలంలోనికి వెళితే ఇది తెలుస్తుంది.

మానవజాతిని దుఃఖం లేని స్థితికి తీసుకొని వెళ్ళటానికే మహాత్ములు అందరూ ప్రయత్నం చేసారు. దుఃఖం లేని స్థితికి తీసుకొని వెళ్ళటమేకాదు, ఆనందసాగరంలో ఊగిసలాడాలి. అది బాహ్యపరిస్థితుల వలన రాదు. టెక్నాలజీ మనకు కొన్ని సదుపాయాలు తీసుకొని వచ్చింది. నిజంగా మన సుఖం సదుపాయాల మీద ఆధారపడి ఉంటే సుఖం పెరిగిపోవాలి. ఇప్పడు కార్లు వచ్చాయి, విమానాలు వచ్చాయి, మరి మీరందరూ సుఖంగా ఉన్నారా? నూటికి నూరుపాళ్ళు ఆనందంగా ఉన్నామని మీలో ఎవరైనా చెప్పగలరా? లేదు. బాహ్యా గొడవలలో సుఖం అనేది లేదు. పూర్వం పంచెలు కట్టుకొని, స్కూలులో చదువుకోకుండా, ఎక్కడికైనా వెళ్ళాలంటే నడిచి వెళుతూ మనకంటే ఎక్కువ సుఖంగా జీవించారు. ఇప్పడు మనం విమానాలలో తిరుగుతూ దుఃఖపడుతున్నాము. సుఖం అనేది కారులలో, విమానాలలో లేదు. సుఖం అనేది బయట లేదు. నీ లోపలే ఉంది. సుఖం అనేది ఎక్కడైతే ఉందో అక్కడ వెతికితే ఈనాడు కాకపోయినా, ముందునాటికైనా అది నీకు లభ్యమవుతుంది. పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఉండాలి. అలాగే నీ లోపల ఉన్న సత్య వస్తువును చేరుకోవాలంటే నీకు అభ్యాసం, వైరాగ్యం అవసరమని పరమాత్మ చెప్పాడు.

ఏ శాస్త్రం చదివినా, భగవద్గీత చదివినా, బైబిలు చదివినా నువ్వు ఆత్మవు అని చెపుతున్నారు, చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో, దుఃఖం ఎలా ఉంటుందో తెలియని ఆత్మవు అని రిపీటెడ్‌గా చెపుతున్నారు. నిజంగా నేనే కనుక ఆత్మను అయితే నాకు దుఃఖం ఎందుకు వస్తోంది, నాకు అశాంతి ఎందుకు వస్తోంది అని అడుగుతున్నారు. దీనికి

ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే రోగాలు శరీరంలో ఉంటాయి. రాగద్వేషాలు, కోపాలు, ఇష్టాలు, బాధలు అన్నీ మనస్సులో ఉంటాయి. కోపం శరీరానికి రాదు, కోపం మనస్సుకు వస్తుంది. తరువాత అది శరీరంపై పడుతుంది. మీకు కోపం వచ్చింది అనుకోండి, దానిని దాచుకొందాము అనుకొన్నా అది మీ కళ్ళలో తెలిసిపోతుంది. మీ మనస్సులో వచ్చే ప్రతీ వికారము శరీరంలోనికి వచ్చేస్తూ ఉంటుంది. మైండ్ యొక్క స్థూల భాగమే శరీరం. ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే నువ్వు దేహం అనుకొన్నప్పుడు ఆత్మవే, నువ్వు మనస్సు అనుకొన్నప్పుడు ఆత్మవే. అయితే నువ్వు ఏమనుకొంటున్నావు దేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు, మనస్సును ఆత్మ అనుకొంటున్నావు. అందుచేత దేహము చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. దుఃఖం మనస్సులో వస్తుంది. మనస్సును ఆత్మ అనుకొంటున్నావు కాబట్టి నాకు దుఃఖం వస్తోంది అంటున్నావు అంటే శరీర ధర్మాలను, మనస్సు ధర్మాలను ఆత్మ మీద ఆరోపించుకొంటున్నావు. నువ్వు కాని మనస్సును, నువ్వు కాని దేహాన్ని నువ్వు అనుకొంటున్నావు. ఇదంతా మిధ్యా జ్ఞానం. ఇదంతా నాన్‌సెన్స్. మిధ్యాజ్ఞానంలో మనిషి ఉన్నప్పుడు వాడు ధనవంతుడైనా, పండితుడైనా, మీకు అధికారం ఉన్నా, ఎన్నో మహిమలు చేయగల సమర్థత ఉన్నా నువ్వు అశాంతిలో నుండి, దుఃఖంలో నుండి విడుదల పొందలేవు. అది ఆచార్యులవారి ఉవాచ. ఈ మాటలు మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మిమ్మల్ని నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళే ప్రయత్నం ఇది. ఎందుచేతనంటే నీ హృదయంలో ఉన్న నిజం దగ్గరకు నీవు చేరుకొనే వరకు నీకు ఫ్రీడమ్ లేదు, నీకు శాంతి లేదు.

ఈ లోకం అంతా దుఃఖాలయం. ఎవరింటికి వెళ్ళినా ఏడుపే. కోరిక నెరవేరితే గర్వం, నెరవేరకపోతే ఏడుపు. ఎలాగైనా పాడైపోతున్నారు. కోరిక లేకుండా చూసుకొందాము అనే బుద్ధి ఎవరికీ కలగటం లేదు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యటమే అభ్యాసము. మరి వైరాగ్యం ఎందుకు? అభ్యాసం చేద్దామని కూర్చొనేటప్పటికి బ్యాంక్ ఎక్కౌంట్ జ్ఞాపకం వస్తుంది. వెంకటేశ్వరస్వామి సమక్షంలో కూర్చొని ఇంట్లో గొడవలు తలపెట్టుకోవటం. అవుట్‌సైడ్ గొడవలమీద మనకు వైరాగ్యం లేదు. వైరాగ్యం లేకపోతే నీకు ఆత్మాన్వేషణ సాధ్యం కాదు. మన శరీరం ఎక్కడైతే ఉందో మనస్సు అక్కడ ఉండటం లేదు. దీనికి వైరాగ్యం లేకపోవటం కారణం. నేను సత్యాన్వేషణ చేస్తున్నాను, మనస్సును నియమించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను అని నువ్వు అనుకొన్నప్పటికి బాహ్యంగా నీకు ఆకర్షణలు ఉన్నంతకాలం, మమకారం ఉన్నంతకాలం నీవు ఏమీ సాధించలేవు. నీకు పేకాట అంటే ఇష్టం అనుకో, విచారణ చేద్దాము అని ఇక్కడ కూర్చొన్నా మనస్సులోపలకు వెళ్ళదు, పేకాట మీదకు పోతుంది. కొంతమంది

జంతువులను వేటాడుతూ ఉంటారు, అదికూడా ఒక వ్యసనం. తిట్టే నోరుకూడా వ్యసనమే. స్త్రీలోలత్వం అంటే స్త్రీ పురుషుల మధ్య దేహానికి సంబంధించిన ఆకర్షణ ఎక్కువగా ఉన్నా నువ్వు విచారణ చెయ్యలేవు. మద్యపానం కూడా వ్యసనమే. కీర్తి కాంక్ష మరీ వరస్ట్. కొంతమందికి ఎంతసేపు పేరు గొడవే. తల్లి కడుపులో నుండి ఒక శవం వచ్చింది, వ్యవహారం కోసం దానికి ఒక పేరు పెట్టారు. ఆ పేరు కల్పితం. అదే నేను అనుకోవటం, గోడమీద ఆ పేరు వ్రాస్తేగాని పది రూపాయలు చందా కూడా ఇవ్వడు. ఎవరైనా పచ్చగా ఉంటే కొంతమంది సహించలేరు, అసూయ వచ్చేస్తుంది. ఎదుటివారు బాగుంటే మనకు వచ్చే నష్టం ఏమీ లేదు కాని అసూయ పడతారు, అది ఒక బలహీనత.

బయట గొడవలమీద ఆకర్షణ తగ్గించుకోకపోతే నువ్వు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నం చేసినా అది ఫలించదు, పరీక్ష వ్రాస్తావు కాని మార్కులు సున్న. ఫండమెంటల్‌గా వైరాగ్యం ఉండాలి. రోడ్డు మీద చూసిన ప్రతీ గడ్డిపరక నాకే కావాలి అనుకొనే వాడికి ఇంక అభ్యాసం ఏమిటి? మనం ఒక పని చేస్తే ఒకరికి ఎక్కువ వస్తుంది, ఒకరికి తక్కువ వస్తుంది. దానిని భగవంతుడి ప్రసాదంగా తీసుకోవాలి. ఫలితం మన ప్రారబ్ధాన్నిబట్టి వస్తుంది. మనకు అంతవరకే అర్హత ఉంది అనుకోవటం మానేసి భగవంతుడిని తిట్టటం, కనిపించినవాడినల్లా తిట్టటం. అంటే ఉన్న దానితో సంతృప్తి పడలేకపోతున్నాము. అజ్ఞానాన్ని పోగొట్టుకోండి, బంధంలో నుండి బయటకు రండి అని చెపితే మనకూడా ఎవరు వస్తారు, ఎవరు డబ్బు ఇస్తారు. ఈ యజ్ఞం చేయండి మీ కోరికలు నెరవేరతాయి అంటే డబ్బు ఇస్తారు, అందుచేత ఈ బిజినెస్ బాగుంటుంది అనుకొంటున్నారు. మీకు ఉన్న అవిద్యను పోగొట్టుకోండి అంటే సమాజంలో ఆ మాటకు ఆకర్షణ ఏముంటుంది. నిద్రలో మనం అందరం హ్యాపీగా ఉన్నాము. తాటాకు ఇంట్లో ఉన్నవాడు నిద్రలో నేను తాటాకు ఇంట్లో ఉన్నాను అనుకోడు, మేడలో ఉన్నవాడు నేను మేడలో ఉన్నానని అనుకోడు నిద్రలో, వాడు ఎంత ఆనందంగా ఉన్నాడో వీడూ అంతే ఆనందంగా ఉన్నాడు. ఎందుచేతనంటే నిద్రలో మనం మన నిజమైన ఇంటికి వెళ్ళిపోతున్నాము. ఎక్కడైతే భగవంతుడు నేను ఉన్నాను అని చెపుతున్నాడో అక్కడికి వెళ్ళిపోతున్నాము. అక్కడ ఏ గొడవ లేదు మీరు ఉన్నారు. నిద్రలో నేను లేను అని ఎవరూ చెప్పటం లేదు. మెలుకువ రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు అన్నీ వస్తాయి. నేను అనే తలంపు వచ్చాక లోకం వస్తుంది, దేవుడు వస్తాడు. నేను అనే మూలతలంపు నీ లోపలనుండే వస్తోంది. నేను అనేది నిజమే కాని నేను అనే తలంపు నిజం కాదు. ఆ మూలతలంపును అభ్యాస వైరాగ్యముల ద్వారా దాని

మూలంలోనికి పంపితే అది నశిస్తుంది, అప్పుడు నువ్వు ఎవరో నీకు తెలుస్తుంది, అదే నిర్వాణస్థితి, అదే స్వర్గరాజ్యం. అప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే.

పొయ్యిలో పిడకలు, కట్టెలు, పుల్లలు వేస్తూ ఉంటే అవి అన్నీ ఎలా భస్మం అయిపోతాయో అలాగే జ్ఞానాగ్నిలో మనం చేసిన కర్మలు అన్నీ అవి మంచికర్మలు అయినా, చెడు కర్మలు అయినా దగ్ధమయిపోతాయి, అట్టి ఆత్మజ్ఞానం వైపుకు కళ్ళు తెరువు, అక్కడికి మేలుకో అంటున్నాడు పరమాత్మ. ఏదైతే సత్యపదార్థమో దాని గురించి విసుగు వచ్చేలా వినండి, విన్నదానిని మనస్సులో తిప్పకోవాలి. మనం ఏదైతే చింతిస్తూ ఉంటామో అదే అవుతాము. విషయాలను చింతిస్తూ ఆత్మలాభం పొందాలంటే పొందలేము, ఆత్మను చింతిస్తూ ఉంటే ఆత్మలాభం పొందుతాము. చమత్కారాల వలన, కుయుక్తుల వలన జీవలక్షణాలు నశించవు, మనస్సు నశించదు, వ్యసనాలు తొందరగా విడిచిపెట్టవు. అవి ఎంత లోతుగా ఉన్నాయో, అంత కష్టపడి సాధన చేసి వాటిని బయటకు లాగితేనేగాని అవి బయటకు పోవు. మన కంట్రోలర్ ఎక్కడో దూరాన లేడు. మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. దేహప్రారబ్ధాన్ని అనుసరించి మనలను ఆడిస్తున్నాడు. వాడు మనలాగ పనిచేయటంలేదు, సైలెంట్‌గా పనిచేస్తున్నాడు ఆయన ఎంత సైలెంట్‌గా పనిచేస్తున్నాడో, మనం చేసేపని కూడా అంత సైలెంట్‌గా చేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము. మనకు పని అక్కరలేదు, ఎడ్వర్‌టైజ్‌మెంట్ కావాలి. ఎవరో చేసిన మంచిపని కూడా మనమే చేసాము అని చెప్పకొంటాము, అంత దిగజారిపోయాము. వ్యసనాలు అన్నీ మనకు దుఃఖకారణాలే. వాటిలో నుండి విడుదలపొందటం చాలా కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా చిన్న అలవాటులో నుండి కూడా బయటకు రాలేము. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు కదా. అందరి హృదయాలలో ఉన్నవాడు నా హృదయంలో కూడా ఉండాలి కదా అయితే మరి నాకు ఎందుకు కనిపించటం లేదు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నీ రాంగ్‌తింకింగ్‌లో నుండి, రాంగ్ హేబిట్స్‌లో నుండి ముందు బయటకు రా అప్పుడు భగవంతుడు ఉన్నాడో లేడో నీకు తెలుస్తుంది. అది అనుభవైక వేద్యం. అది నీ ఇంద్రియాలకు అందకపోవచ్చు, నీ మనస్సుకు అందకపోవచ్చు, నీ బుద్ధికి గోచరించకపోవచ్చు, వాడు అనుభవైకవేద్యం, అనుభవానికి అందుతాడు. నీ వాండరింగ్ మైండ్‌లో నుండి బయటకు వచ్చి చూడు, అప్పుడు ఉన్నాడో లేడో నీకే తెలుస్తుంది. సాక్ష్యాలతో పనిలేదు అని చెప్పారు.

కామక్రోధములనుండి బయటకు రాలేకపోతున్నాను అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. కామక్రోధములకు అసలు బలం అంటూ లేదు. వాటి గురించి నువ్వు

చింతిస్తున్నావు. నువ్వు చింతించేకొలది వాటికి బలం పెరిగిపోతుంది. ఈ నాన్‌సెన్స్ అంతా ద్వైతంలో నుండే వస్తోంది. నిజం అనేది రెండుగా లేదు, మూడుగా లేదు, నిజం అనేది ఏకంగానే ఉంది. నీ మనస్సును తీసుకొనివెళ్ళి హృదయంలో ఉన్న నిజంతో ఏకం చెయ్యి. లోపల ఉన్న సద్వస్తువుతో ఏకత్వం వచ్చాక నీకు ద్వైతం ఏమీ లేదు. మనం ఆత్మచింతన చేస్తున్నాము అని అనుకొంటున్నాము కాని మనం చేసేది విషయచింతన. చీమ ఎంత నెమ్మదిగా నడుస్తుందో అంత నెమ్మదిగా ప్రయాణం చేసినా ఫరవాలేదు గాని రైట్ డైరెక్షన్ విడిచిపెట్టవద్దు, గోల్‌ను మర్చిపోవద్దు. మద్రాసు వెళ్ళాలి అనుకొని కలకత్తా వెళ్ళే రైలులో కూర్చొంటే దానికి అర్థం ఏమిటి? అనాత్మను చింతిస్తూ నాకు ఆత్మజ్ఞానం కావాలంటే ఎలా సాధ్యమవుతుంది. మనం ఏ వస్తువునైతే తెలుసుకోవాలి అనుకొంటున్నామో దాని తాలూక అనుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. మన హృదయంలో ఉన్న సద్వస్తువే అంతటావ్యాపించి ఉంది. అది వేరు ఇది వేరు కాదు. ఎప్పుడైతే నీకు దేహాభిమానం నశించిందో లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. అది అంతటా వ్యాపించి ఉంది కాబట్టి మనం కూడా అంతటా ఉన్నాము అనే అనుభవం నీకు కలుగుతుంది. అప్పుడు రాకపోకలతో పనిలేదు. అప్పుడు ఎటుచూసినా శాంతే.

నేను అనే తలంపు మనకు లోపల నుండే వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక ఇతరతలంపులు వస్తున్నాయి. నేను అనే తలంపు, దానికి వచ్చే ఇతరతలంపులు ఈ మూట అంతా కలిసి మనస్సు అంటున్నాము. మనస్సు వచ్చాక దేహం, దేహం వచ్చాక లోకం, లోకం వచ్చాక దానికి ఎవడో ఒక కర్త ఉండాలి కదా, అక్కడ నుండి దేవుడు వస్తున్నాడు. అందుచేత నీవు మూలతలంపు మూలంలోనికి వెళితే దేవుడు, లోకము, మనస్సు ఇవన్నీ కూడా లోపలకు విత్‌డ్రా అయిపోతాయి, అప్పుడు అంతటా ఉన్నది మీరే. ఈ దేవుడి కథ, లోకాల కథ, పుణ్యపాపాలు, కర్మలు ఇవన్నీ కూడా ఈ మూలతలంపు మీదే ఆధారపడి ఉన్నాయి. ఆ మూలతలంపును మీరు అనుకొంటున్నారు కాబట్టి దానిని డౌట్ చేయటం లేదు. ఆ మూలతలంపు మీరు అనుకొన్నంతకాలం దానిలోనుండి బయటకు రాలేరు. అది నేను కాదు అని ముందు మీకు అర్థమవ్వాలి. జ్ఞానం అంటే మిధ్యాజ్ఞానం కాదు. నువ్వు పుస్తకాలు చదివితే పాండిత్యం వస్తుంది, సన్మానాలు చేస్తారు, అక్కడితో సరి, మరణానంతర జీవితం సున్నా. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో, ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. ఒకే వాక్యం చెప్పాడు అంతే. ఎంత అందంగా చెప్పాడో చూడండి, బుద్ధి ఉన్నవారు అంతా ఆలోచించండి. కోరికలు పెట్టుకొని దేవతలను పూజించేవారికి కోరికలు నెరవేరవచ్చు,

ఆ దేవతలను పొందవచ్చు. నన్నే ఆరాధించేవాడు, నాకోసం జీవించేవాడు, నా సంతోషం కోసం పనిచేసేవాడు నా అనుగ్రహానికి పాత్రుడవుతాడు, నన్ను పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు. అక్కడ నన్ను అంటే ఆత్మని పొందుతాడు. నిరంతరం నన్ను స్మరించటమే ధ్యేయంగా పెట్టుకొన్నవాడు లౌకికకార్యాలు, వైదికకార్యాలు వదిలేసినా వాడిని పాపం అంటదు అని చెప్పాడు. అంటే మనలను ధర్మం విడిచిపెట్టేయమనికాదు.

మనం చేయరాని పనులు చేయకూడదు, చెయ్యవలసిన పనిని మానకూడదు. అంటే మనం చెయ్యకూడనిపని చేస్తే ఎంతదోషం వస్తుందో మనం చెయ్యవలసిన పని వదిలేసినా అంతే దోషం వస్తుంది. సత్యం నీ హృదయంలో ఉంటే సరిపోదు, అంతమాత్రంచేత దుఃఖం నశించదు. దాని తాలుక ఎరుక నీకు వచ్చినప్పుడే దుఃఖరహితస్థితిని పొందగలవు. మనందరకు ఆస్తులు లేకపోయినా, అందరికి తలో ఒక శవం ఉంది. ఈ శవంతో ఏ భోగం అనుభవించినా తప్పనిసరిగా అది రోగం కింద వస్తుంది. పూర్వజన్మలో మనం అనుభవించిన భోగాలే ఇప్పుడు రోగాల కింద వస్తున్నాయి. ఈ జన్మలో అనుభవించే భోగాలు రాబోయే జన్మలో రోగం కింద వస్తాయి. భోగం అనుభవించాడా వాడికి రోగం వచ్చి తీరుతుంది. ప్రతీ భోగం వెనకాల రోగం ఉంటుంది అది మనకు తెలియదు. భోగం బాగానే ఉంది అనుకొంటాము, దాని వెనకాల రోగం ఉంది అని మనకు తెలియటం లేదు. అది తెలియచెప్పేవాడే గురువు. పుణ్యలోకాలు ఉన్నాయా, చీకటిలోకాలు ఉన్నాయా, స్వర్గలోకం ఉందా అని భగవాన్‌ను అడిగితే ఆయన ఉన్నాయనీ చెప్పలేదు, లేవు అని చెప్పలేదు. ఆయన ఏమని చెప్పారు అంటే శరీరం చనిపోయిన తరువాత ఎవడైతే ప్రయాణం చేస్తున్నాడో వాడెంత నిజమో నువ్వు అనుకొనే లోకాలు కూడా అంతే నిజం అని చెప్పారు. ఇవన్నీ వ్యవహారిక సత్యాలు. భగవంతుడు తెలుసుకోమన్నది వ్యవహారిక సత్యాలను కాదు. ఏదైతే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో అంతటా వ్యాపించి ఉందో దాని తాలుక ఎరుక నీకు రావాలి. అప్పుడు అంతట వ్యాపించి ఉన్నాను అన్న సంగతి నీకు తెలుస్తుంది, అప్పుడు కమింగ్ లేదు, గోయింగ్ లేదు. ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు, ఇప్పుడే ఇక్కడే ఈ జన్మలోనే ఆ స్థితిని పొందు, అక్కడకు నీ కళ్ళు తెరువు, వాయిదాలు వేయవద్దు. రేపుకు రూపు లేదు.

జరిగిపోయిన గొడవలు వద్దు. వర్తమానకాలాన్ని సాధనకు జాగ్రత్తగా ఉపయోగించుకో. ఈ రోజు చేసుకొనే పని ఈరోజే చేసుకోవాలి లేకపోతే దోషం వస్తుంది. ఏరోజుకారోజు రేపు రేపు అంటే సోమరితనానికి అలవాటు పడి అలా చెపుతారు. సోమరితనానికి అలవాటుపడినవాడికి ఏ పురుషార్థం లేదు. వాడికి ధర్మం లేదు, అర్థం

లేదు, కామం లేదు, మోక్షం లేదు, వాడు ఎందుకు పనికిరాడు. సృష్టి ఎప్పుడూ అలా జరుగుతూ ఉంటుంది. సృష్టిలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది, పుణ్యం ఉంటుంది, పాపం ఉంటుంది, రకరకాలుగా ఉంటుంది. దానిని పట్టించుకోవద్దు, మీరు వచ్చినపని చూసుకొని వెళ్ళిపోండి. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. అన్ని ఆకర్షణల మధ్యలో నిర్వికారంగా ఉండగలుగుతున్నామా లేక ఏదైనా ఆకర్షణకు గురి అవుతున్నామా అనేది చూసుకోవాలి. మన బలహీనతలు ఏమిటో లోకం చెపుతుంది అంతే, ఆ బలహీనతలను లోకం తియ్యదు. నువ్వు సాధనచేసి, గురువు అనుగ్రహాన్ని సంపాదించి ఆ బలహీనతల నుండి బయటకు రావాలి. సాధన చెయ్యటం అంటే ఏదో కొత్తగా సంపాదించటం కాదు. పూర్వజన్మల నుండి తెచ్చుకొన్న అలవాట్లలో నుండి విడుదల పొందటమే సాధన. ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖానికి వెళుతోందో ఆ కారణాన్ని తొలగించుకోవటమే సాధన యొక్క గమ్యం. రోగం వచ్చాక దానిని తగ్గించుకోవటంకంటే అసలు రోగం రాకుండా చూసుకోవటం మంచిది. కోరిక వచ్చాక దానిని నిగ్రహించుకోవటానికి ప్రయత్నం చేయటంకంటే అసలు కోరిక రాకుండా చూసుకోవాలి. ఇతరులకు మంచి మాటలు చెప్పటం మంచిదే కాని దానికంటే టాప్‌మోస్ట్ ఇంపార్టెన్స్ సత్యాన్వేషణకు ఇవ్వాలి. నేను మీకు మంచి మాటలు చెప్పాను అనుకోండి. నాన్నగారు మీరు మంచి మాటలు చెప్పారు అంటే మాకు గర్వం వస్తుంది, అది మరల సత్యాన్వేషణను ఆపుచేస్తుంది. మీరు మంచిపనులు చేయటం మంచిదే. మీరు మంచి పనులు చేసారు అని ఎవరైనా పొగుడుతూ ఉంటే అప్పుడు మీకు వికారాలు ప్రారంభమవుతాయి, ఆ వికారాలు మీరు లోపలకు వెళ్ళకుండా ఆటంకపరుస్తాయి.

మీరు ధ్యానం చెయ్యండి, విచారణ చెయ్యండి, ఆ చేసే శక్తి మీకు లేదు అనుకోండి మనస్సును ముస్తాబు చెయ్యవద్దు అని భగవాన్ చెప్పారు. దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నారో దానిని డెకరేట్ చెయ్యవద్దు. కామక్రోధాలు చాలా లోతుగా ఉంటాయి. గోడలోనికి ఒక మేకును మనం చాలా లోతుగా కొట్టాము అనుకోండి, అది ఊరికే ఇలా లాగితే రాదు, ఎంత బలంగా మనం గోడలోకి కొట్టామో అంతబలంగా ఆ మేకును బయటకు లాగాలి. కామక్రోధములు ఎన్నో జన్మలనుండి మనలో లోతుగా పాతుకొనిపోయి ఉన్నాయి. కామక్రోధాల యొక్క లోతు ఎంత ఉందో, అంత గట్టిగా సాధన చేస్తేగాని కామక్రోధాల నుండి మనం విడుదల పొందలేము. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అన్నారు భగవాన్. ఆత్మలో దుఃఖం లేదు. దుఃఖం వచ్చినా, సంతోషం వచ్చినా దేహము నేను అనే బుద్ధికే వస్తుంది. దేహం ఉన్నప్పటికి కర్తృత్వం ఎవడికైతే నశించిందో వాడిని

దుఃఖం ముట్టుకోదు. కర్తృత్వం నశించినా వాడు ఉంటాడు, ఎలా ఉంటాడు అంటే ఆత్మగా ఉంటాడు. ఆత్మకు దుఃఖంతో సంబంధం లేదు. పుణ్యం చేసినా, పాపం చేసినా నేను చేసాను, నేను చేసాను అంటూ దేహగతమైన నేనుతో చేస్తాడు అందుచేత ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. కర్తృత్వం నశించింది అనుకోండి వాడికి ప్రారబ్ధం లేదు, ఆగామి లేదు, సంచితం లేదు. కర్తృత్వం పోయినతరువాత అన్నీ పోతాయి. వాడు ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని చూసేవాడికి అనిపిస్తుంది కాని అక్కడ ప్రారబ్ధం కూడా లేదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 06-03-08, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు మహాశివరాత్రి. ఈరోజున చాలామంది పగలు ఉపవాసం రాత్రి జాగరణ చేస్తారు. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే ఉండమని. ఈరోజున మనం పరమాత్మకు దగ్గరగా గడపాలి. రాత్రి జాగరణ చేసి శివుడిని ధ్యానం చేస్తూ శివస్మరణతో ఉండాలి. శివుడు జ్ఞానం ఇస్తాడని, విష్ణువు మోక్షం ఇస్తాడని మనపెద్దలు సాంప్రదాయంలో చెపుతారు. జ్ఞానం అన్నా మోక్షం అన్నా ఒక్కటే. ఈరోజుగడిచిపోతే చాలు అని మనం అనుకొంటాము. కాని మనకు దీర్ఘకాలిక చూపులేదు. అన్నికాలాలలో, అన్నిఅవస్థలలో ఏ వస్తువు అయితే ఉందో దానిని తెలుసుకొనేవరకు మనం సాధన చేయాలి. అప్పుడు గాని మన ప్రయాణం ముగియదు. శివుడు అభిషేక ప్రియుడు, విష్ణువు అలంకార ప్రియుడు, సూర్యుడు నమస్కారప్రియుడు, సుబ్రహ్మణ్యుడు దర్శనప్రియుడు. వీరందరూ దేవతలు, అందరి దేవతల పట్ల మనం గౌరవంగా ఉండటం, పూజ్యభావంతో ఉండటం మంచిది. ఒకటి ఉంటే రెండు వస్తుంది, రెండు ఉంటే మూడువస్తుంది, మూడుంటే నాలుగు వస్తుంది. ఇంక అక్కడ ఆగదు. అసలు ఆ ఒక్కటీలేదు అన్నారు భగవాన్. ఇక్కడ ఒక్కటి అంటే అహంకారం, నేను అనేతలంపు. అది ఉంటే ఆదేవుడు అని, ఈదేవుడు అని స్వర్గం అనీ, నరకంఅనీ, పుణ్యంఅనీ, పాపం అనీ రైలుఇంజను వెనకాలపెట్లు వచ్చినట్లు అన్నీవచ్చేస్తాయి. అది లేకపోతే ఏదీ లేదు. మీరు చెప్పిన మాటలు మాకు నచ్చటంలేదు అని భగవాన్‌తో అంటే మీ అహంకారానికి ఎలా నచ్చుతాయి అన్నారు. సత్యాన్ని సమీపించటానికి అహంకారానికి ఇష్టం ఉండదు ఎందుచేతనంటే అక్కడికి చేరితే ఇదినశిస్తుంది.

మనం ఏదైతే నేను, నేనుఅంటున్నామో ఆనేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. ఈనేను అంటే మనకు ఇష్టం అందుచేత దానిని విడిచిపెట్టలేకపోతున్నాము, దానిగురించి విచారణ చేయటంలేదు. ఈనేను అనే తలంపు హదయంయొక్కలోయలలో గాఢంగా